క్లుప్తంగా

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన ధర్మారావ్‌పేట్ విద్యార్థులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారావ్‌పేట్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు పోచంపాడ్ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సదాశివ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో యోసెఫ్ అభినందించారు.

స్పాట్ వాల్యూయేషన్ నుంచి మినహాయించాలి



నిరసన తెలుపుతున్న ఎస్జీటీలు

బాన్సువాడ రూరల్: పదోతరగతి స్పాట్ వ్యాల్యూయేషన్‌లో స్పెషల్ అసిస్టెంట్ విధుల నుంచి ఎస్జీటీలను మినహాయించాలని బాన్సువాడ ఎస్జీటీ ఉపాధ్యాయ సంఘం కామారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అయ్యాల సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రానికి ఉపాధ్యాయులతో చేరుకుని నిరసన వ్యక్తంచేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి హన్మాండ్లు, కోశాధికారి శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు సంజయ్ ఉపాధ్యాయులు రవి, శ్రీకాంత్‌రెడ్డి, నిఖిల్, భూమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులు వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి



మాట్లాడుతున్న కరుణశ్రీ

కామారెడ్డి టౌన్ : తెలుగు, హిందీ భాషా పండితులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకోవాలని భాషా పండిత కోర్సు డైరెక్టర్ కరుణశ్రీ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నూతనంగా పదోన్నతి పొందిన తెలుగు, హిందీ భాషా పండితులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

నష్టపోయిన పంటల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న తిరుమల ప్రసాద్

బాన్సువాడ రూరల్: గురువారం కురిసిన అకాల వర్షంతో కొల్లూర్ గ్రామ శివారులో నష్టపోయిన పంటలను శుక్రవారం కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. పంటపొలాల్లో తిరిగి నేలకొరిగిన పైరు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి మహ్మద్ ఫైజుల్లా, ఏఈవో చిట్టంపల్లి కావ్యశ్రీ తదితరులు ఉన్నారు.

మా భూమి రథయాత్ర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 14న ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ చేపట్టబోయే లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర కార్యక్రమ కరపత్రాలను జిల్లా నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రథయాత్ర కొనసాగుతుందని జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ తెలిపారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: సామాజిక అంతరాలను నిర్మూలించడానికి దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతగానో కృషి చేశారని స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలిచిన జీపీ భవన నిర్మాణ పనులు

- అంగన్‌వాడీ, అద్దెభవనాల్లో వలు పంచాయతీల నిర్వహణ
- నిధుల లేమితో పనులు నిలిచాయంటున్న కాంట్రాక్టర్లు
- పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్తుల వినతి



నడిమితండాలో ..



ఆరెపల్లిలో నిలిచిన జీపీ భవన నిర్మాణం

రాజంపేట: మండలంలోని ఆరేపల్లి, నడిమితండా గ్రామాలలో పంచాయతీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆరెపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో, నడిమితండాలో అద్దె భవనంలో గ్రామ పంచాయతీల నిర్వహణ కొనసాగుతోంది. అరెపల్లిలో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది భయాందోళన మధ్య పనులు చేస్తున్నారు. 2019లో అప్పటి ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. మండలంలోని అరేపల్లి, నడిమితండా, సిద్దాపూర్ లల్లో నూతన జీపీ భవనాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 20 లక్షలు కేటాయించింది. మండలంలో సిద్దాపూర్‌లో జీపీ భవన నిర్మాణం పూర్తయింది. ఆరెపల్లి, నడిమితండాలో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మండలంలోని శేరిశంకర్ తండా, గుడితండా, ఎల్లారెడ్డిపల్లి తండా, ఎల్లాపూర్ తండాల గ్రామ పంచాయతీలకు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవు. ఆరెపల్లి, నడిమితండాలో జీపీ భవన పనులు ఏడాదిన్నర కావస్తున్న ఇంకా పనులు కొనసాగుతున్నాయి.పనులు త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిల్లుల జాప్యంతోనే ..

కాంట్రాక్టర్లకు సరైన సమయంలో బిల్లు రాకపోవడంతో పనుల్లో ఆలస్యం జరుగుతుందని తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి సకాలంలో బిల్లులు అందించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ఆరెపల్లి, నడిమితండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లు జాప్యంతోనే పనులు ఆలస్యంగా పనులు కొనసాగతున్నాయని కాంట్రాక్టర్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చూస్తాం.

–ఇన్‌చార్జి ఎంపీడీవో, రఘురాం

బిల్లులు రాక అప్పుల్లో కూరుకుపోతున్నాం

ఆరెపల్లిలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులు చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా సకాలంలో బిల్లులు రాక పనులు నిలిపేశాం. మండలంలో ఆర్గొండ, కొండాపూర్, శివాయిపల్లి గ్రామాలలో మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులకు కూడా సంవత్సరం గడుస్తున్నా బిల్లులు రాలేదు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు అందించేలా చర్యలు తీసుకోవాలి.

–కొండ అశోక్, కాంట్రాక్టర్

సమస్యలను దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా



భిక్కనూరులో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

భిక్కనూరు/దోమకొండ/రామారెడ్డి/బీబీపేట/రాజంపేట/మాచారెడ్డి /కామారెడ్డి టౌన్ : ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలో, రామారెడ్డి మండలం అన్నారం రైతు వేదికలో, బీబీపేట రైతు వేదికలో, దోమకొండ రైతు వేదికలో, రాజంపేట రైతు వేదికలో, మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా రైతు వేదికలో, పాల్వంచ మండల కేంద్రంలో, జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను, బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ సంక్షేమ పథకాల దరఖాస్తుల్లో ఇబ్బందులుంటే తన దృష్టి తేవాలని కోరారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బీజేపీ మండలాధ్యక్షుల్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

గత రెండు రోజులుగా రాజంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, కబ్జాలను అడ్డుకోవాలని గ్రామస్తులు నిరసన చేపట్టారు. గ్రామస్తులు శుక్రవారం ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాజంపేటలో కబ్జాలకు గురైన భూములు, ప్రభుత్వ భూముల వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ప్రభుత్వ భూములపై ప్రత్యేక విచారణ చేపట్టి విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల తహసీల్దార్ సతీష్ రెడ్డి సూచనల మేరకు నిరాహారదీక్ష ను విరమించుకుంటున్నట్లు నిరసనకారులు తెలిపారు.

యువత దేశ రక్షణకు కృషి చేయాలి

యువత దేశ భక్తిని అలవర్చుకుని దేశ రక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే కేవీఆర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయ డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్మీ అవగాహన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైన అభ్యర్థులను సన్మానించారు.

నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

భిక్కనూరు : గ్రామాల్లో నీరు వృథా కాకుండా గ్రామపంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కామారెడ్డి డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంతో పాటు పెద్దమల్లారెడ్డి గ్రామాలను సందర్శించారు.ఈ సందర్భంగా పారిశుధ్యపనులను, నర్సరీలను,డంపింగ్ యార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్య పనులను వేగంగా పూర్తి చేయాలని, అలాగే డంపింగ్ యార్డుల్లో కంపోస్టును తయారు చేయాలన్నారు. ఆయన వెంట భిక్కనూరు,పెద్దమల్లారెడ్డి ఈవోలు మహేష్‌గౌడ్, లక్ష్మిలు ఉన్నారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి



మొక్కలకు నీరు పడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డిరూరల్: నర్సరీలలోని మొక్కలకు నీరు అందించి వాటిని సంరక్షించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలం మల్కాపూర్ గ్రామంలో గల నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలోని మొక్కలకు ఆయన నీరు పట్టారు. ఎండల తీవ్రత దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ తదితరులున్నారు.

నేలకొరిగిన వరి



వరి నుంచి పారుతున్న నీటిని చూపుతున్న మహిళ

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండలంలో గురువారం కురిసిన వర్షానికి వరి పంట నేలకొరిగింది. దుర్కి గ్రామానికి చెందిన సాయిలు 4 ఎకరాల పంటను కౌలుకు చేస్తున్నారు. అకాల వర్షానికి పంట మొత్తం నేలకొరగడంతో నీటిలో తేలియాడుతుందని శుక్రవారం అతని భార్య అనుశవ్వ వాపోయింది. పంట చేతికి వచ్చాక చెడగొట్టు వాన వచ్చి నష్టం చేసిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



లింగుపల్లి గ్రామంలో ర్యాలీ తీస్తున్న నాయకులు

దోమకొండ/మాచారెడ్డి/కామారెడ్డి టౌన్ : భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ మాచారెడ్డి మండలాధ్యక్షుడు నౌసిలాల్ అన్నారు. మాచారెడ్డిలో, దోమకొండ మండలం లింగుపల్లి గ్రామంలో కామారెడ్డి పట్టణంలో 5వ వార్డులో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్, గాంధీ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో దోమకొండ పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనే శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు జీ. శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద(జుక్కల్) : స్థానికతహసీల్ కార్యాలయాన్ని శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరాణ్మయి సందర్శించి రికార్డులు పరిశీలించారు. రికార్డులు పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులకు వెంటనే భూమి రిజిస్ట్రేషన్లు చేసి పంపించాలని సూచించారు. అధికారులు స్థానికంగా ఉంటూ ప్రతి రోజు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అక్రమ ఇసుక, మొరం జరగకుండా నిఘా ఉంచాలని తహసీల్దార్ వేణుగోపాల్‌కు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ భరత్, ఆర్ఐ రవీందర్ ఉన్నారు.

తెలంగాణలోనే సన్నబియ్యం పంపిణీ



నస్రుల్లాబాద్ : అంకోల్ క్యాంపులో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ/నస్రుల్లాబాద్ : ఉచిత సన్న బియ్యం పంపిణీ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలోనే ప్రారంభించామని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం రైతు నగర్, నస్రుల్లాబాద్ మండలం అంకోల్ క్యాంపు గ్రామాల్లో రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దామరంచ మంజీర శివారులో ఉన్న ఎత్తిపోతల పథకానికి కొత్త మోటార్లు కావాలని రైతులు పోచారంనకు వివరించారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కొత్త మోటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పోచారం గ్రామంలో ..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి గ్రామంలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. మాజీసర్పంచ్ నర్సాగౌడ్, రమేష్, జగన్‌రెడ్డి, తదితరులున్నారు.

అంకోల్ క్యాంపు ఆదర్శ గ్రామం

గ్రామాభివృద్ధి క్షేత్ర స్థాయి నాయకుల నాయకత్వ లక్షణాలపైనే ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇందులో అంకోల్ క్యాంపు మాజీ సర్పంచ్ వెంకట రమణ ముందున్నాడన్నారు. ఆయన నాయకత్వంలోనే ప్రతి ఇంటికి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఈకార్యక్రమం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. నిధులను ప్రజలకు అందించి పలువురి నాయకులకు మార్గదర్శకంగా ఉన్నారని, ఆయన సేవలను కొనియాడారు. ఏఎంసీ చైర్‌పర్సన్ శ్యామల, వైస్ చైర్మన్ యామరాములు, తహసీల్దార్ ప్రవీణ్, లత, ఎంపీడీవో సూర్యకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో వంట సామగ్రిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సురేందర్ సూచించారు. మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలల పరిసరాలు, వంటశాలలో నిల్వ ఉంచిన సరుకులను తనిఖీ చేశారు. మైనారిటీ గురుకుల పాఠశాలలో కూరగాయలు తాజాగా లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట సామగ్రి సైతం నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. నిర్వాహణ సక్రమంగా లేదని మండిపడ్డారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

మండలంలోని ఎల్లారం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సురేందర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశామని ఇప్పటి వరకు 11 ఇళ్లు మాత్రమే ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. మిగతావి నిర్మాణాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా చూడాలన్నారు. పారిశుధ్య పనులు రోజు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ఎల్లారెడ్డి: పట్టణంలోని 12 వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సర్వేను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అఖిల్, అజయ్ తదితరులున్నారు.

రాములోరి కల్యాణానికి పట్టువస్త్రాల అందజేత



ముత్యంపేట హనుమాన్ ఆలయం వద్ద పట్టువస్త్రాలు అందజేస్తున్న స్వాములు

దోమకొండ: ఈనెల 6న జరుగనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన హనుమాన్‌దీక్ష పరులు శుక్రవారం 9 గ్రామాలకు చెందిన ఆలయాల నిర్వాహకులకు పట్టు వస్త్రాలను అందజేశారు. సీతారాముల కల్యాణం కోసం ముత్యంపేట హనుమాన్ ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కామారెడ్డి, రామారెడ్డి, అడ్లూరు, జంగంపల్లి, లక్ష్మీదేవునిపల్లి, చుక్కాపూర్, బీబీపేట, అంచనూరు, దోమకొండ గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాలకు వీటిని అందజేసినట్లు హనుమాన్‌దీక్షపరులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆలయ కమిటీ ప్రతినిధులు కాలువ అంజిరెడ్డి, పవన్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్‌గౌడ్, సిద్దాగౌడ్, సంతోష్, నరహరి, ప్రవీణ్, మంగళిస్వామి, దుర్గాప్రసాద్, రాజు,ముత్యంగౌడ్, వెంకటి, తదితరులున్నారు.

శ్రీరామనవమికి ముస్తాబైన రామాలయం

ఎల్లారెడ్డి/లింగంపేట : ఎల్లారెడ్డిలోని రామాలయం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం, 7న ఎడ్లబండ్ల ప్రదర్శన, 9న గోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణుని కళ్యాణం, 11న రాత్రి రథోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.లింగంపేట రామాలయం పరిసరాలను శుక్రవారం శుభ్రం చేయించినట్లు ఎంపీవో మలహరి తెలిపారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఆలయాలను ఉత్సవాలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభం

మాచారెడ్డి: మండలంలోని పోలంపల్లి శాంతానంద తపోవన ఆశ్రమంలోని రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతం, గీతాపారాయణం,శ్రీరామాజపయజ్ఞం నిర్వహించారు.

మౌలాన్‌ఖేడ్‌లో బోనాల పండుగ



బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. ఉగాది ఉత్సవంలో భాగంగా గ్రామంలోని ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలను సమర్పించారు. పిల్లాపాపలు పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

సంక్షిప్తం

మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఎన్నిక

బాన్సువాడ : బీర్కూర్ మండల మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మేకల విఠల్, గౌరవ అధ్యక్షుడిగా తోట నారాయణ, ఉపాధ్యక్షుడిగా బాబురావు, నల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రెంజర్ల అనిల్, సహాయ కార్యదర్శిలుగా సత్యం , రాంబాబు, కోశాధికారిగా అంబయ్యలను ఎన్నుకున్నారు.

దేవునిపల్లి మహమ్మదీయ మజీద్ కమిటీ..

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామ మహమ్మదీయ మజీద్ నూతన కమిటీ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంఏ సజ్జాత్, సెక్రెటరీగా ఎస్‌కే రియాజ్, క్యాషియర్‌గా ఇలియాస్, జాయింట్ సెక్రటరీగా ఆరీఫ్ తదితరులు ఎన్నుకున్నారు.

సీతారాముల కల్యాణ ఉత్సవాల కమిటీ..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రైల్వే స్టేషన్ 64వ వార్షికోత్సవ సీతారాముల కల్యాణ నవరాత్రి ఉత్సవాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ వి.సత్యం, ప్రధాన కార్యదర్శిగా పాత రమేష్, గౌరవ అధ్యక్షుడిగా యాద భైరయ్య, కార్యదర్శిగా బి.రాజేశ్, ఉపాధ్యక్షుడిగా బినయ్‌కుమార్, పార్శి రాజేశ్వర్, యెల్లంకి సుదర్శన్, పబ్బ జగన్నాథం, కోశాధికారులుగాగా విశ్వనాథం, రాజేశ్వర్‌తో పాటు మరో 22 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

కాళికాదేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని గోపాలస్వామి రోడ్ లోగల కాళికాదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారికి ఓడి బియ్యం, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన టీజీవో ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: జిల్లా అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు)గా నియమితులైన చందర్‌నాయక్‌ను శుక్రవారం జిల్లా గెజిటెడ్ అధికారులు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.దేవేందర్, సాయిరెడ్డిలతో పాటు ప్రతినిధులు సుంకరి భూమయ్య తదితరలు కలిశారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడారు

'సాహిత్య అధ్యయనంతో ప్రపంచాన్ని అర్థం చేసుకోవచ్చు'

కామారెడ్డి అర్బన్: సాహిత్య అధ్యయనంతో ప్రపంచాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవచ్చని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాల ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో ×త్రో ద లెన్స్ ఆఫ్ లిటరేటర్–ఏ జర్నీ ఇన్ రీడింగ్'' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. తెలంగాణ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగాధిపతి కేయూ రమణచారి, బోర్డు ఆఫ్ ఇంగ్లీష్ చైర్ పర్సన్ పి.సమతలు ఆంగ్ల భాష, సాహిత్యంపై విశ్లేషణాత్మక వివరణ ఇచ్చారు.

వెల్లుట్లలో విద్యుత్ స్తంభం ఏర్పాటుపై గ్రామస్తుల హర్షం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల మీదుగా విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు విన్నవించారు. ఎమ్మెల్యే సూచన మేరకు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో నూతనంగా విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రమాదకరంగా వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899